సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 14 । ఆగస్టు । 2024



దొంగల ముఠా అరెస్ట్

తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో



డ్రోన్ ద్వారా శాంపిల్స్ చేరవేత

టీబీ అనుమానితుల నుంచి సేకరించిన కఫం శాంపిల్స్‌ను రాజాపేట పీహెచ్‌సీ నుంచి ఎయిమ్స్‌కు డ్రోన్ ద్వారా పంపారు.

- 8లో



కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

- 9లో

న్యూస్‌రీల్

జాతీయ జెండా ఆవిష్కరించనున్న గుత్తా

భువనగిరిటౌన్: 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు ప్రభుత్వం ముఖ్య అతిథులను ప్రకటించింది. ఈమేరకు గురువారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించే వేడుకలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

భువనగిరిటౌన్: స్వాతంత్య్ర దినోత్సవానికిగాను భువనగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో చేసిన ఏర్పాట్లను కలెక్టర్ హనుమంతు కె.జెండగే మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట భువనగిరి తహసీల్దార్ అంజిరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్ ప్రసాద్ తదితరులున్నారు.

ఎరువులు తగిన మోతాదులో ఉపయోగించాలి



అడ్డగూడూరులో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ అనురాధ

అడ్డగూడూరు: రైతులు పంట పొలాల్లో రసాయన ఎరువులు తగిన మోతాదులో ఉపయోగించాలని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ అన్నారు. మంగళవారం అడ్డగూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతునేస్తం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలో పత్తి, వరి పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. పంటల్లో రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట ఏఈఓలు దయాకర్, శ్వేత, నవనిత పాల్గొన్నారు.

పంట రుణాలు త్వరితగతిన అందించాలి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంట రుణాలు మాఫీ చేసిన నేపథ్యంలో తిరిగి రుణాలు త్వరితగతిన అందజేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన డీసీసీబీ, పీఏసీఎస్ సిబ్బంది డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వల్పకాలిక రుణాలను రూ.లక్ష నుంచి రూ.1.50లక్షకు పెంచడం జరిగిందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో మొదటి విడతలో రూ. 143 కోట్లు, రెండో విడతలో రూ. 97 కోట్లు రుణమాఫీ జరగగా , ఆగష్టు 15న మూడో విడతలో రూ.226 కోట్లు మాఫీ కానున్నాయన్నారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్లు అందెల లింగంయాదవ్, మొగిలిపాక రామచంద్రయ్య, బ్యాంకు సీఈఓ శంకర్‌రావు, డీఆర్‌ఓ ఎస్‌డీ హరిణి, పీఏసీఎస్ అధ్యక్షులు, ఏజీఎం ఉదయశ్రీ, బ్యాంకుల మేనేజర్లు, సూపర్‌వైజర్లు, పీఏసీఎస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఒక కుటుంబం.. ఒక వార్డు

పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా రూపకల్పన

- ఓటరు లిస్టులో కుటుంబ సభ్యులంతా ఒకే వరుస క్రమంలో ఉండేలా చర్యలు
- ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసిన ప్రభుత్వం
- ఇప్పటికే కార్యదర్శులకు పూర్తయిన శిక్షణ

సాక్షి, యాదాద్రి: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సంకేతాలిచ్చిన నేపథ్యంలో అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఎన్నికల నిర్వహణలో ప్రధానమైన వార్డుల విభజనపై ప్రథమంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితా తయారు చేసే ప్రక్రియ ప్రారంభించారు. ఇందుకు సంబంధించి ఇటీవల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు.

అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా..

గత సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ఆధారంగా వార్డుల విభజన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 421 గ్రామ పంచాయతీలు, 3,666 వార్డులు ఉన్నాయి. ఇందుకు సంబంధించి ఎన్నికల ఓటరు జాబితాను నియోజకవర్గం, మండలాలు, గ్రామాల వారీగా ఎన్నికల అధికారుల నుంచి పంచాయతీ అధికారులు తీసుకున్నారు. 2018 అసెంబ్లీ, 2024 లోక్‌సభ, 2019 గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలను కూడా పరిశీలిస్తున్నారు. ఆయా ఓటరు జాబితాల ఆధారంగా వార్డుల వారీగా విభజన చేయాలని నిర్ణయించింది. వార్డుల విభజనకు సంబంధించి పాటించాల్సిన మార్గదర్శకాలను జారీ చేసింది. ఒక కుటుంబం అంతా ఒకే వార్డు పరిధిలో, ఒక ప్రాంతం ఓటర్లు ఒకే వార్డులో ఉండేలా విభజన చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గత ఎన్నికల సమయంలో ఒక కుటుంబంలో ఓటర్లు రెండు, మూడు వార్డుల్లో ఉండడం, కొన్ని చోట్ల ఇతర వేర్వేరు పోలింగ్ బూత్‌లలో, ఇతర గ్రామాల్లోనూ ఓటరుగా నమోదయ్యారు. వీరిని ఒక వార్డు పరిధిలోకి వచ్చేలా విభజన చేయనున్నారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయం చేసుకొని జాబితా రూపొందించనున్నారు. అదేవిధంగా ఓటరు లిస్టులో కుటుంబ సభ్యులంతా ఒకే వరుస క్రమంలో ఉండేలా చూసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇందు కోసం ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. దీని ద్వారా వార్డుల విభజన చేయనున్నారు.



భువనగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాపై శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ

సెప్టెంబర్‌లో ఎన్నికలు?

2024 ఫిబ్రవరి 1తో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిసింది. 2023 లో అసెంబ్లీ ఎన్నికలు, కొత్త ప్రభుత్వం ఏర్పాటు, లోక్‌సభ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణ జాప్యం అయ్యింది. అయితే గత ఎన్నికల్లో ఓటర్లు, ప్రస్తుత ఓటర్లు, గత ఎన్నికల సందర్భంగా వార్డులకు, సర్పంచ్ పదవికి ఉన్న రిజర్వేషన్ ఏంటన్న అంశాలపై ఎన్నికల సంఘం కలెక్టర్ల నుంచి గత ఏడాది డిసెంబర్‌లోనే నివేదిక తీసుకుంది. దీనిని 'తెలంగాణ-పోల్' (టీఈ-పోల్) వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఉద్యోగుల వివరాలతో పాటు 2009, 2014, 2019 పంచాయతీ ఎన్నికల్లో వార్డులు, గ్రామాల వారీగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను 'పీపీఆర్‌ఎస్' మాడ్యూల్‌లో గత ఏడాదే పొందుపరిచారు. అధికారులు ఓటరు, వార్డు జాబితాలను సిద్ధం చేస్తున్న నేపథ్యంలో వచ్చే సెప్టెంబరు మొదటి వారంలో షెడ్యూల్ వచ్చి సెప్టెంబరు మూడో వారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

గీత కార్మికుల రక్షణకే సేఫ్టీ కిట్



సేఫ్టీ కిట్‌తో తాటి చెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు, పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు, గీత కార్మికులు




శిక్షణ పొందుతున్న అడ్డగూడూరుకు చెందిన గీత కార్మికుడు

యాదగిరిగుట్ట: గీత కార్మికులకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సేఫ్టీ కిట్‌ను ఇవ్వనుందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, బీసీ వెల్ఫేర్ అధికారి యాదగిరి, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు అన్నారు. కాటమయ్య రక్షణ సేఫ్టీ కిట్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లి కాటమయ్య ఆలయం వద్ద గీత కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గీత కార్మికులకు వృత్తిలో ప్రమాదాలను నివారించడానికి జిల్లాలో మొదటగా ఎంపిక కాబడిన కల్లుగీత కార్మికులకు ఇవ్వనున్న కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ మోకులతో తాటి చెట్లను ఎక్కే పద్ధతిని చూపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలేరు, మోత్కూర్, భువనగిరి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు దీపి, రవిచంద్రారెడ్డి, నరేందర్, స్థానిక సొసైటీ అధ్యక్షుడు సీస కృష్ణగౌడ్, పట్టణ నాయకులు మచ్చ నర్సింహ, పరకాల అంజయ్య, బత్తిని భిక్షం, నరసింహ, వెంకటేష్, తోటరాజు తదితరులున్నారు.

నకిలీ ఇక్కత్ డిజైన్ల ప్రింటింగ్‌ను అరికట్టాలి

- చేనేత రాష్ట్ర నాయకుడు తడక వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి: నకిలీ చేనేత ఇక్కత్ డిజైన్లు ప్రింటింగ్ కాకుండా అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని చేనేత రాష్ట్ర నాయకుడు తడక వెంకటేశం అన్నారు. ఇక్కత్ డిజైన్లు యథేచ్ఛగా ప్రింటింగ్ చేసి అతితక్కువ ధరకు విక్రయిస్తుండటం వల్ల చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని టై అండ్ డై అసోసియేషన్ ఆధ్వర్యంలో పోచంపల్లి, చౌటుప్పల్, కోయలగూడెం, సిరిపురం, ఎల్లంకి, పుట్టపాక, గట్టుప్పల్, చండూరు, ఆలేరు, జనగాం జిల్లా బచ్చన్నపేట, జనగాం, గూడూరుకు చెందిన ముఖ్య చేనేత నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏళ్ల క్రితమే పోచంపల్లి ఇక్కత్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు యథేచ్ఛగా ప్రింటింగ్ చేసి అతితక్కువ ధరకు విక్రయిస్తుండటం వల్ల చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధానమంత్రి మోదీ దృష్టికి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. జీఐ యాక్ట్‌ను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్‌ను కేటాయించాలన్నారు. చేనేత అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. సమావేశంలో టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, తెలంగాణ పద్మశాలీ సంఘం ప్రాంత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక రమేష్, ఆప్కో మాజీ డైరెక్టర్ కర్నాటి వెంకటేశం, చేనేత రంగ నిపుణులు ప్రొఫెసర్ తడక యాదగిరి, పద్మశాలీ సంఘం రాష్ట్ర నాయకుడు కందగట్ల భిక్షపతి, కర్నాటి బాలరాజు, కొండల్‌రావు, చేనేత సంఘాల అధ్యక్షులు గడ్డం జయశంకర్, వడ్డేపల్లి నర్సింహ, గజం సత్యనారాయణ, గట్టు రాజు, బేతి వెంకటేశం, సామల సత్యనారాయణ, రాపోలు శ్రీనివాస్, కర్నాటి లింగయ్య, మెరుగు శశికళ, చేనేత నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత రాష్ట్ర నాయకుడు తడక వెంకటేశం

ఉపాధి కూలీలు ఆర్థికంగా ఎదగాలి



రామాజీపేట గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో సమావేశమైన డీఆర్‌డీఓ నాగిరెడ్డి

- డీఆర్‌డీఓ నాగిరెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జీవనం సాగిస్తున్న కూలీలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని రామాజీపేట గ్రామంలో వంద రోజులు పనులు పూర్తి చేసుకున్న ఉపాధి హామీ కూలీలకు వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలు ఉపాధి హామీ పనులకే పరిమితం కాకుండా వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఇతర పనులు చేసేందుకు సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, శ్రీ ఉన్నతి పేరుతో స్వయం ఉపాధి శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వంద రోజుల ఉపాధి హామీ పనులు పూర్తి చేసిన కూలీలకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ వారు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి, పని కల్పిస్తారన్నారు. అంతకుముందు శిక్షణ పొందుతున్న మహిళలకు డ్రెస్ కోడ్ అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, ఎంపీడీఓ ప్రభాకర్ రెడ్డి, ఎంపీఓ సలీమ్, ఏపీఓ నారాయణ, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్, ఏపీఎమ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన



ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి జయరాజు

భువనగిరి క్రైం: భువనగిరిలోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్ రావు మంగళవారం సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. పాఠశాలలోని పాత భవనాలు వర్షాకాలంలో విద్యార్థులకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందన్నారు. భోజనంలో నాణ్యత లోపించిందన్నారు. బాల బాలికలకు న్యాయ సేవలు అందించటానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆయా పాఠశాలలను సందర్శించి తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సిందూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వెండి జోడు సేవ వంటి పూజలు నిర్వహించారు.

ఆయనపై ఇక్కడా ఆరోపణలు !

- ఏసీబీకి పట్టుబడ్డ ఎంవీ భూపాల్‌రెడ్డిపై యాదాద్రి జిల్లాలోనూ అవినీతి ఆరోపణలు
- గతంలో ఆర్డీఓ, తహసీల్దార్‌గా విధుల నిర్వహణ

సాక్షి, యాదాద్రి: లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డిపై యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగ, రాజకీయ వర్గాల్లో భూపాల్‌రెడ్డి అంశంపై తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ఆయన గతంలో బొమ్మలరామారం, బీబీనగర్, భువనగిరి తహసీల్దార్‌గా, భువనగిరిలో రెండు సార్లు ఆర్డీఓగా విధులు నిర్వహించారు. పదోన్నతిపై గత సంవత్సరం జూలై 15న రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా వెళ్లారు.

గతంలో ఏసీబీ రెక్కీ..

భూపాల్‌రెడ్డి ఆర్డీఓగా రెండోసారి భువనగిరికి వచ్చారు. మే 25, 2016 నుంచి మార్చి 9,2019 వరకు మొదటి సారి, డిసెంబర్ 12, 2019 నుంచి జూలై 15, 2023 వరకు భూపాల్‌రెడ్డి భువనగిరి డివిజనల్ అధికారిగా పనిచేశారు. మొదటి సారి ఎన్నికల బదిలీల్లో రంగారెడ్డి జిల్లాకు వెళ్లిన అయన ఎన్నికల అనంతరం మరో సారి భువనగిరి ఆర్డీఓగా వచ్చారు. అయితే రెండవ సారి ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న సమయంలో వచ్చిన ధరణి అములులో ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతో కొందరు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆర్డీఓ కార్యాలయంపై ఏసీబీ అధికారులు రెక్కీ నిర్వహించారు. ఈ విషయం లీక్ కావడంతో సదరు ఫిర్యాదుదారుడితో ఆయన సయోధ్య కుదుర్చుకున్నారు. అయితే ఎప్పటి నుంచో భూపాల్‌రెడ్డిపై పలు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా భూసేకరణలో నష్టపరిహారం నిర్ణయించడంలో తమకు అన్యాయం చేశారని కాశేశ్వరం, రాయిగిరి రైతులు ఆరోపించారు. ఫైళ్ల క్లియరెన్స్‌లో భారీగా చేతివాటం ప్రదర్శించే వారని ఆరోపణలు ఉన్నాయి. కొందరు ప్రైవేట్ వ్యక్తులతో ఆర్థిక లావాదేవీలు నడిపే వారని, ముడుపులు అప్పచెప్పిన వారి ఫైళ్లను వేగంగా క్లియర్ చేసేవారని పలువురు విమర్శిస్తున్నారు.



ఎంవీ భూపాల్‌రెడ్డి

యువత జాతీయ భావాలు అలవర్చుకోవాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి



చౌటుప్పల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, నాయకులు

చౌటుప్పల్: యువత జాతీయ భావాలు అలవర్చుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. దేశం- ధర్మం అనే అంశాలకు ప్రతి పౌరుడు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హర్‌ఘర్ తిరంగాలో భాగంగా భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో విద్యార్థులతో కలిసి జాతీయ రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను నా కుటుంబం అని కాకుండా నేను నా దేశం అనే భావన ప్రతిఒక్కరిలో రావాలన్నారు. దేశంపై ప్రేమను పెంచుకొని నిజమైన జాతీయవాదులుగా మారాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా కార్యదర్శులు ఆలె చిరంజీవి, బత్తుల జంగయ్య, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, మున్సిపల్, మండల అధ్యక్షులు కంచర్ల గోవర్దన్‌రెడ్డి, చినుకని మల్లేష్, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి దిండు భాస్కర్, మండల అధ్యక్షుడు పబ్బు వంశీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి డిగ్రీ కాలేజీలకు మెమోలు పంపిణీ

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలలకు బుధవారం నుంచి విద్యార్థుల మెమోలను అందజేస్తామని యూనివర్సిటీ పరీక్షల నిర్వహణ అధికారి ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ కౌన్సిలింగ్‌కు వెళ్లే విద్యార్థులకు మెమోల గురించి ఆందోళన అవసరం లేదన్నారు. కౌన్సిలింగ్‌కు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని సూచించారు. 6వేల మంది డిగ్రీ విద్యార్థుల మెమోలను ఆయా కళాశాలలకు అందజేస్తామన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

చౌటుప్పల్: ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ నిరుద్యోగ అభ్యర్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులో మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉపాధి నైపుణ్య అభివృద్ధి శిక్షణా కేంద్రం ఉమ్మడి జిల్లా డైరెక్టర్ కొప్పు విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ పాసైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18–25 ఏళ్ల మధ్య వయస్సు గలవారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో 90శాతం హాజరు ఉన్న అభ్యర్థులకు నెలకు రూ.4వేలు ఉపకార వేతనం అందిస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 24వ తేదీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల గరిష్ఠ ఆదాయం రూ.5లక్షల లోపు ఉండాలన్నారు. విద్యార్హత, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోను దరఖాస్తుకు పొందుపర్చాలన్నారు. మరిన్ని వివరాల కోసం నల్లగొండలోని కార్యాలయంలో లేతా 08682–220007 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నల్లగొండ వాసికి తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోషిప్


తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలోషిప్ అందుకుంటున్న రాంచందర్

నల్లగొండ: పట్టణానికి చెందిన డాక్టర్ రాంచందర్‌కు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్‌కుమార్ మంగళవారం హైదరాబాద్‌లో ఫెలోషిప్ ప్రదానం చేశారు. రాంచందర్ భువనేశ్వర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్(టీఎస్)లో సీనియర్ సైంటిస్ట్‌గా గత 18 ఏళ్లుగా పనిచేస్తున్నారు. దేశ ప్రజల్లో వినికిడి లోపానికి కారణమైన జన్యుపరమైన విషయాలు తెలుసుకుని వాటిని సవరించే పరిశోధనలకు రామచందర్ కృషిచేశారు. జన్యుశాస్త్ర రంగంలో ఆయన సాధించిన విజయాలకు గుర్తింపుగా ఈ ఫెలోషిప్ దక్కింది.

డ్రోన్ ద్వారా ఎయిమ్స్‌కు శాంపిల్స్ చేరవేత


డ్రోన్ ద్వారా టీబీ అనుమానితుల కఫం (తెమడ) శాంపిల్స్ పంపిస్తున్న వైద్య సిబ్బంది

రాజాపేట: టీబీ అనుమానితుల నుంచి సేకరించిన కఫం(తెమడ) శాంపిల్స్‌ను రాజాపేట పీహెచ్‌సీ నుంచి బీబీనగర్ ఎయిమ్స్‌కు ల్యాబ్ టెక్నీషియన్లు మంగళవారం డ్రోన్ ద్వారా పంపారు. వాటి ఫలితాలకు సంబంధించిన సమాచారం బాధితుల ఫోన్‌కు బుధవారం వరకు వెళ్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాజాపేట మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్‌కుమార్, మెయిల్ అసిస్టెంట్ ఉపేందర్, ఏఎన్‌ఎం అనిత, జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నిండుకుండలా.. కనులవిందుగా..

సాగర్ జలాశయం నిండుకుండలా ఉంది. సాగర్ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 589.50 అడుగులు ఉంది. మొత్తం అవుట్‌ఫ్లో 47,727 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా.. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో 47,727 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

– నాగార్జునసాగర్



నాగార్జునసాగర్ జలాశయం తీరంలో మొసళ్లు

నాగార్జునసాగర్: సాగర్ జలాశయ తీరంలో మంగళవారం మొసళ్లు కనిపించాయి. దీంతో జలాశయ తీరంలో చేపలు పట్టే మత్స్యకారులతో పాటు బట్టలు ఉతుక్కునేందుకు నీటిలోకి దిగేవారు, లాంచీ స్టేషన్‌లో లాంచీలు ఎక్కే పర్యాటకులు, విధులు నిర్వర్తించే ఎస్‌పీఎఫ్ సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని ఎన్‌ఎస్‌పీ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చిన వరదతో సాగర్ జలాశయంలోకి మొసళ్లు రావడం సహజమని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

దొంగల ముఠా అరెస్ట్

- నిందితుల నుంచి రూ.23లక్షల విలువైన బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు

నల్లగొండ క్రైం: తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.23.53 లక్షల విలువైన 31 తులాల బంగారం, కిలో వెండి ఆభరణాలు, రూ.28వేల నగదు, యాక్టీవా, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మంగళవారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన గుండెబోయిన మహేష్, గుండెబోయిన మల్లేష్, నూతి సతీష్ అలియాస్ సత్యం, బైరబోయిన స్వామి అలియాస్ శివమణి, గుండెబోయిన చంద్రం అలియాస్ చందు, బడే బాలకృష్ణ అలియాస్ బాలు, వలిగొండ మండలం మారమ్మకాలనికి చెందిన బోడిగ అశోక్ అలియాస్ డీఎస్‌పీ ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఉదయం రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతుండేవారు. గుండెబోయిన మహేష్, బోడిగ అశోక్ చోరీ చేసిన బంగారాన్ని మిర్యాలగూడలో విక్రయించేందుకు యాక్టీవాపై వెళ్తుండగా.. తిప్పర్తి మండలం అనిసెట్టి దుప్పలపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్న నల్లగొండ సీసీఎస్ పోలీసులు, తిప్పర్తి పోలీసులు అనుమానం వచ్చి ఆపారు. వారిని విచారించగా జూలై 30న తిప్పర్తి మండలం పెద్దసూరారం గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడినట్టు అంగీకరించారు. వారిని అదుపులోకి తీసుకుని చోరీకి ఉపయోగించే ఇనుప రాడ్లు, బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారు ఇచ్చిన సమాచారంతో ముఠాలోని మిగతా ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వీరంతా పాత నేరస్తులని, గతంలో జైలుకు సైతం వెళ్లి వచ్చారని ఎస్పీ తెలిపారు. తిప్పర్తి, కట్టంగూర్, చిట్యాల, నార్కట్‌పల్లి, నల్లగొండ టౌన్, రామన్నపేట ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్‌ఐ రాజు, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, లింగారెడ్డి, పాష, రామ్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

వెలిమినేడు ఆలయంలో కేంద్ర మంత్రి పూజలు


కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు ఆశీర్వచనం చేస్తున్న ఆలయ అర్చకులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ పరిధిలో గల ఆంజనేయస్వామి ఆలయంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మంగళవారం పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు వల్లూరి నిఖిల్‌శర్మ, భానుప్రకాష్‌శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. కేంద్ర మంత్రి తన వాహనానికి పూజలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మల్లారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు 'ఆరోగ్యశ్రీ' భరోసా

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న మహిళ వివరాలు సేకరించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

మోత్కూరు: మండలంలోని ముశిపట్ల గ్రామానికి చెందిన నిరుపేద మహిళ బుషిపాక రమ్యశ్రీ తంబో తెరపిక్ పుర పుర అనే అరుదైన వ్యాధితో బాధపడుతుండగా.. మంగళవారం సాక్షి దినపత్రికలో ఆమెపై ప్రచురితమైన కథనానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ ప్రమోద్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు రామన్నపేట ఏరియా ఆరోగ్యశ్రీ అధికారి మహేందర్ ముశిపట్ల గ్రామానికి చేరుకుని బాధితురాలి భర్త రమేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ అరుదైన వ్యాధికి సంబంధించి ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం చేసే అవకాశం లేదని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆరోగ్యశ్రీ ద్వారా ఆర్థికసాయం అందేలా ప్రయత్నిస్తామని ఆరోగ్యశ్రీ అధికారి మహేందర్ రమేష్‌కు వివరించారు. యశోద హాస్పిటల్‌కు సంబంధించిన ఆరోగ్యశ్రీ విభాగం సిబ్బంది వివరాల సేకరించారని, అదే విధంగా మరో రెండు స్వచ్ఛంద సంస్థలు వైద్య చికిత్స కోసం ఆర్థికసాయం చేస్తామని హామీ ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు.

లారీని ఢీకొట్టిన డీసీఎం.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట వద్ద ఘటన


ధ్వంసమైన డీసీఎం ముందుభాగం


గురువయ్య మృతదేహం


గాయపడిన గోపాలకృష్ణ

చౌటుప్పల్ రూరల్: లారీని వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామ పరిధిలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లికి వెళ్తున్న ఉషోదయ సూపర్ మార్కెట్‌కు చెందిన డీసీఎం చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామ సమీపంలో ముందువెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ప్రయాణిస్తున్న దుద్దు గురవయ్య(42) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సూపర్ మార్కెట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేసే మల్కాజ్‌గిరికి చెందిన దుద్దు గోపాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. డీసీఎం లారీని ఎడమ వైపు ఢీకొట్టడం వల్ల డ్రైవర్ కొట భాస్కర్‌రావు క్షేమంగా బయటపడ్డాడు. మృతుడు గురవయ్య స్వస్థలం ఖమ్మం కాగా కొంత కాలంగా అతడు హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ ప్రాంతంలోని రహమత్‌నగర్‌లో నివాసముంటూ కొబ్బరికాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. విజయవాడలో తన బంధువు మరణించడంతో అంత్యక్రియలకు వెళ్లి వస్తూ ప్రమాదంలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన గోపాలకృష్ణను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదవరెడ్డి తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


రామచంద్రం (ఫైల్)

గుర్రంపోడు: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తితో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం ఆమలూరు గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమలూరు గ్రామానికి చెందిన కొండా రామచంద్రం (43) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న రామచంద్రం జీవితంపై విరక్తితో మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి కిందకు దింపి చూడగా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని గుర్రంపోడు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి: మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో మంగళవారం రాత్రి కారు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్(38) కొండమల్లేపల్లిలో నివాసముంటూ తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి జడ్చర్ల–కోదాడ హైవేపై చిన్నఅడిశర్లపల్లి సమీపంలో ఓ దాబా వద్ద భోజనం చేసిన అనంతరం రోడ్డు దాటుతుండగా రమావత్ భిక్షనాయక్ అనే వ్యక్తి కారును వేగంగా నడుపుతూ రాజ్‌కుమార్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి జేబులో మద్యం సీసాలు ఉండడంతో ప్రమాదానికి మద్యం మత్తే కారణమై ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

భర్త కళ్లెదుటే భార్య దుర్మరణం

- బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదం


భార్య మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త

అర్వపల్లి: భార్యాభర్తలు బైక్‌పై సంతకు వెళ్లి తిరిగొస్తుండగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బైక్‌ను పక్కకు తిప్పగా బైక్‌పై నుంచి కిందపడి భార్య మృతిచెందింది. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండలం వేల్పుచర్ల గ్రామ స్టేజీ వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడివెంల గ్రామానికి చెందిన గోల్కొండ బాలనర్సయ్య, తన భార్య లక్ష్మమ్మ (65) బైక్‌పై గ్రామం నుంచి మంగళవారం సాయంత్రం అర్వపల్లి సంతకు వచ్చారు. సంతలో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై వేల్పుచెర్ల గ్రామ స్టేజీ వద్ద ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి బాలనర్సయ్య బైక్‌ను పక్కకు తిప్పగా బైక్ పైనుంచి లక్ష్మమ్మ కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు కొంతకాలం సూర్యాపేటలో నివాసముండి ఇటీవలే స్వగ్రామానికి తిరిగి వచ్చారని, గ్రామంలోనే ఉంటూ వ్యవసాయం చేసుకోవాలని అనుకున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

భువనగిరిలో నకిలీ సర్టిఫికెట్ల విక్రయం..?

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలో నకిలీ సర్టిఫికెట్లు తయారుచేసి విక్రయిస్తున్న ఇద్దరిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. పట్టణంలోని సమ్మద్ చౌరస్తాలో ఏ టూ జెడ్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌ను నడిపిస్తున్న అబ్దుల్లా అలియాస్ గణేష్‌తో పాటు గాంధీపార్క్ ఎదురుగా రబ్బర్ స్టాంపుల తయారీదారుడు గిరి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నట్లు వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితుల వద్ద కంప్యూటర్లను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిసింది. మరికొందరు ఈ ముఠాలో సభ్యులుగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళపై కత్తితో దాడి

చిలుకూరు : మహిళపై కత్తితో దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మంగళవారం చిలుకూరు మండలం ఆర్లెగూడెంలో జరిగింది. చిలుకూరు మండలం కొండాపురం గ్రామానికి చెందిన దొంగరి సంధ్య తన తల్లిగారి ఊరైన ఆర్లెగూడేనికి వచ్చింది. మంగళవారం ఆమె పొలం వద్దకు వెళ్తుండగా.. కుటుంబ తగదాల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన ఆరె సైదాబాబు వెనుక నుంచి వచ్చి ఆమెపై కత్తితో దాడి చేశాడు. చుట్టుపక్కల వారు చూసి ఆస్పత్రికి తరలించారు. సంధ్య తండ్రి ఫిర్యాదు మేరకు సైదాబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ తెలిపారు.

అవయవదానం.. నలుగురికి ప్రాణదానం

- బ్రెయిన్‌డెడ్ అయిన ఆటో డ్రైవర్ అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు


రాస అశోక్ (ఫైల్)

రామన్నపేట: తాను చనిపోతూ మరో నలుగురికి ప్రాణదానం చేశాడు రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ రాస అశోక్(39). బ్రెయిన్‌డెడ్ అయ్యి మృత్యువుతో పోరాడుతున్న అశోక్ అవయవాలను దానం చేయడానికి భార్య లలిత, ఇతర కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. అశోక్ ఈ నెల 10వ తేదీన బంధువులతో కలిసి పనినిమిత్తం నిజామాబాద్‌కు వెళ్లాడు. టాటా ఏస్ వాహనంలో తిరిగి వస్తుండగా మెదక్ జిల్లా రామాయంపేట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రిలో చేర్పించగా.. బ్రెయిన్‌డెడ్ అయినట్లు డాక్టర్లు తెలిపారు. వైద్యులు, ఇతరుల సలహా మేరకు కుటుంబ సభ్యులు అశోక్ అవయవాలను దానం చేయడానికి అంగీకరించడంతో కళ్లు, కిడ్నీ, గుండె, లివర్ తదితర అవయవాలను వైద్యులు అతని శరీరం నుంచి సేకరించారు. సోమవారం రాత్రి అశోక్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నార్మాక్స్ మాజీ చైర్మన్ గంగుల క్రిష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పూస బాలకిషన్ ఆస్పత్రి వద్ద అశోక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అవయవదానం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అశోక్‌కు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గోల్కొండపై మోగనున్న మహిళా డప్పు దరువు


స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొననున్న మహిళా డప్పు కళాకారులు

గరిడేపల్లి: గోల్కొండ కోటలో గురువారం జరగనున్న స్వాతంత్య్ర వేడుకల్లో గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ డప్పు కళాబృందం మహిళా డప్పు కళాకారులు పాల్గొననున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్ సహకారంతో స్వాతంత్య్ర వేడుకల్లో డప్పు ప్రదర్శన ఇచ్చేందుకు అవకాశం రావడం సంతోషంగా ఉందని డప్పు మాస్టర్ అమరవరపు సతీష్ అన్నారు.

పోగొట్టుకున్న చెవి కమ్మలు బాధితురాలికి అప్పగింత


భక్తురాలికి చెవి కమ్మలను అప్పగిస్తున్న సురక్ష సిబ్బంది వినయ్‌గౌడ్, ఎస్‌పీఎఫ్ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న బంగారు చెవి కమ్మలను ఆలయ, ఎస్‌పీఎఫ్ సిబ్బంది కనిపెట్టి ఆమెకు అప్పగించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన జె. కుమారి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం యాదాద్రీశుడిని దర్శించుకునేందుకు వచ్చారు. ఈ క్రమంలో కుమారికి చెందిన మూడు గ్రాముల బంగారు చెవి కమ్మలు ఆలయ సన్నిధిలో పడిపోయాయి. దీనిని గమనించిన సురక్ష సిబ్బంది వినయ్‌గౌడ్ ఎస్‌పీఎఫ్ పోలీసులతో కలిసి భక్తురాలు కుమారికి అప్పగించారు. నిజాయితీ చాటుకున్న సురక్ష సిబ్బంది వినయ్‌గౌడ్‌ను పలువురు అభినందించారు.

ముదురు నారు నాటితే జాగ్రత్తలు పాటించాలి

- పొలంలో కాలిబాటలు తీయాలి
- కొనలు తుంచి నాటుకోవాలి
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు


ముదిరిన వరి నారు

పాడి పంట

త్రిపురారం : ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు కింద వరి నాట్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలకు వరద ఉధృతి అధికంగా వచ్చి సాగర్ ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది. ఈ నేపథ్యంలో ఎడమ కాలువకు సాగు నీరు విడుదల ఆలస్యం కావడంతో బోరు బావుల కింద వేసిన నారు ముదిరింది. ఈ పరిస్థితుల్లో ముదురు నాటు నాటాల్సి వస్తోంది. ముదురు నాటు నాటాల్సి వస్తే రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు తెలియజేశారు. వివరాలు ఆయన మాటల్లో..

- ఆయకట్టు ప్రాంతాల్లో కొన్నిచోట్ల వరినారు దొరకకపోవడంతో నాట్లు ఆలస్యమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ముదురు నారు నాటాల్సి వస్తోంది. అలాంటి సమయంలో రైతులు తగిన మెళకువలు పాటించాలి. సాగు చేసే రకాన్ని బట్టి ఎంత వయసు ఉన్న నారు మొక్కల్ని నాటుకోవచ్చు అనే విషయాన్ని రైతులు తెలుసుకోవాలి.
- దీర్ఘకాలిక సాంబమసూరి రకాలు అయితే నారు మొక్క వయసు 30 నుంచి 45 రోజుల వరకు ఉండవచ్చు.
- మధ్యకాలిక కృష్ణ ఎంటీయూ 1001 జగిత్యాల మసూరి, ఆర్‌ఎన్‌ఆర్ 15048 తెలంగాణ సోనా వంటి రకాలకు సంబంధించి 30 నుంచి 40 రోజులు వయసు ఉండవచ్చు.
- స్వల్పకాలిక రకాలు 1010, తెల్లహంస, కేఎన్‌ఎమ్ 118, ఎస్ఎల్ఆర్ 34449 రకాలైతే 25 నుంచి 35 రోజుల వరకు ఉండవచ్చు.
- నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని అనుసరించి వానాకాలంలో దీర్ఘకాలిక రకాలు చదరపు మీటరుకు 33 మూనలు ఉండాలి.
- నాటిన తరువాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల కాలిబాటలు తీయాలి.
- కాలిబాటల వల్ల గాలి వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి తగ్గుతుంది.
- ఎరువులు, పురుగు మందులు, వేసుకోవడానికి కాలిబాటలు ఉపయోగపడతాయి.

ముదురు వరి నారు నాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ముదురు వరి నారు నాటాల్సి వస్తే కుదురుల సంఖ్య పెంచుకోవాలి.
- ఒక్క కుదురుకు 5 నుంచి 6 మొక్కలు నాటుకోవాలి.

వెదజల్లే పద్ధతి ఉత్తమం

రైతులు ఈ సమయంలో 125 రోజులు స్వల్పకాలిక రకాలను ఎంచుకోవాలి. వరి నారు లేని రైతులు దమ్ము చేసుకుని వెదజల్లే పద్ధతి ద్వారాగానీ సీడ్ డ్రిల్ ద్వారాగాని విత్తుకోవచ్చు. పొడి దుక్కిలో కూడా వెదజల్లుకోవచ్చు, సీడ్ డ్రిల్ ద్వారా కూడా విత్తుకోవచ్చు.

- నత్రజని ఎరువులను సిఫారసు చేసిన మోతాదుకంటే 25 శాతం పెంచాలి.
- సాధారణంగా నత్రజని ఎరువులను మూడు దఫాలుగా వేస్తారు.
- పొలంలో ముదురు నారు నాటినప్పుడు రెండు దఫాలుగా సిఫారసు చేసిన మోతాదులో 70 శాతం దమ్ములోను, మిగిలిన 30 శాతం అంకురం దశలోను వేసుకోవాలి.
- వరి నాటు నాటేటప్పుడు నారు కొనలు తుంచి నాటుకోవాలి.
- తల్లి పురుగులు గుడ్లు వరి నారు కొనల మీద పెడుతాయి. ముదురు నారు నాటేటప్పుడు నారు కొనలు తుంచుకోవడం వల్ల ఈ పురుగుల గుడ్లను నిర్మూలించవచ్చు. దీంతో పాటు ముక్కి పురుగు, కాండం తొలుచు పురుగు, తెల్ల కంకులు రాకుండా కూడా నివారించవచ్చు.